నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, మంగళవారం 9 జనవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

నేడు అన్నాసాగర్‌కు ఎమ్మెల్సీ కవిత

మూసాపేట, జనవరి 8 : భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్ గ్రామానికి మంగళవారం ఎమ్మెల్సీ కవిత రానున్నట్లు మూసాపేట జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి ఈనెల 4వ తేదీన గుండెపోటుతో మృతి చెందిన విషయం విధితమే. అందుకు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తోపాటు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఎమ్మెల్సీ కవిత 9వ తేదీన ఉదయం 11గంటలకు వస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు

నెట్టెంపాడు నీళ్లిచ్చేందుకు కృషి

- ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లావెం కట్రామిరెడ్డి

అయిజ, జనవరి 8 : ఆర్డీఎస్ ఆయకట్టుకు నెట్టెంపాడు ప్రాజెక్టు నీళ్లిచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం అయిజ పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయం ఆవరణలో సింధనూర్, కుటుకనూర్, కొత్తపల్లి గ్రామాల రైతులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను కలిసి సాగునీటి విడుదల గురించి చర్చించారు. వానకాలంలో వానలు సమృద్ధిగా కురవకపోవడంతో తుంగభద్ర జలాశయం పూర్తిగా నిండుకుందని, ఆర్డీఎస్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీటి విడుదల చేయకపోవడంతో పంటలు పండించలేక పోయామని, వచ్చే వానకాలం నాటికి నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని చిన్నోనిపల్లి రిజర్వాయర్, లింక్ కెనాల్ పనులు పూర్తి చేసి ఆర్డీఎస్ ప్రధానకాల్వకు డిస్ట్రిబ్యూటర్ 12ఏ వద్ద కలిపితే ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. అలాగే కొత్తపల్లి – సింధనూర్ రోడ్డు, కొత్తపల్లి– లింగపురం రోడ్డు, కుటుకనూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని వారిని కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రభుత్వం, ఉన్నతాధికారులతో చర్చించి పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టి, సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. అంతకుముందు అయిజ రైతు సంఘం నాయకులు కూడా నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని కాల్వలు పూర్తి చేసి, మండలానికి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు,బీఆ ర్ఎస్‌నా యకులుపా ల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

క్రికెట్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మె ల్యే విజయుడు,ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆకాంక్షించారు. సోమవారం పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి ప్రాంగణంలో జరుగుతున్న ఐపీఎల్-8 క్రికెట్ పోటీలకు వారు అతిథులుగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధు లు, నాయకులు,క్రీ డాకారులుపా ల్గొన్నారు.

క్రీడలతో స్నేహ భావం

అయిజ రూరల్, జనవరి 8: క్రీడలతో స్నేహ, సోదర భావం పెంపొందుతుందని ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం మండలంలోని యాపదిన్నెలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, రాముడు, సుందర్‌రాజు, తిప్పన్నతోపాటు వివిధ గ్రామాలసర్ప ంచులు, ఎంపీటీసీలుపా ల్గొన్నారు.

భక్తులకు సహకారం అందిస్తాం

- ఆర్యవైశ్య సంఘం సభ్యులు

శ్రీశైలం, జనవరి 8 : శ్రీశైల క్షేత్రానికి తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చే భక్తులకు తమవంతు సహకారాన్ని అందిస్తూ నిత్యాన్నదాన కార్యక్రమాన్ని జరిపిస్తున్నట్లు మల్లికార్జున నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడు మిడిదిడ్డి శ్యాంసుందర్ తెలిపారు. సోమవారం శ్రీశైల మహా క్షేత్రంలో నిత్యాన్నదాన సేవను నిర్వహిస్తున్న మల్లికార్జున సత్రం 2024 వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం ప్రతి నిధులు, దాతల సహకారంతో అన్నదా నం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిత్యాన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, రామకృష్ణ, సురేశ్, ఆంజనేయులు, ఆర్యవైశ్య సం ఘం అధ్యక్షుడు మార్కండేయ, దేవకి వెంకటనర్సయ్య, చిన్న సుబ్బయ్య, మల్లికార్జున, వాసవీ సత్ర సముదాయ సమన్వయకర్త శ్రీధర్, సత్రం మేనేజర్ శివ, ఏఎం శివకుమార్, మోహన్, చంద్రకాంత్, మల్లి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

పాన్‌గల్, జనవరి 8 : మండలంలోని చిక్కేపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి సురేశ్‌కుమార్‌ను సోమవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సస్పెండ్ చేశారు. అభయహస్తం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో పంచాయతీ కార్యదర్శి సురేశ్‌కుమార్ సక్రమంగా విధులకు గైర్హాజరు అవుతున్నారని, విధులపట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ సస్పెన్షన్ చేసినట్లు ఎంపీవో రఘురామ్ వెల్లడించారు.



29 ప్యాకేజీ పరిధిలో మాడ్గుల వరకు నిర్మించిన అసంపూర్తిగా ఉన్న డీ-82 కాల్వ

నిలిచిన నీళ్లు.. పనులే తరువాయి..!

- మళ్లీ సాగునీరు పారేలోగా పూర్తి చేయాలి
- ఈలోగా పెండింగ్ పనులు చేపట్టాలి
- ఆయకట్టు రైతులకు తప్పని ఇక్కట్లు
- డిస్ట్రిబ్యూటరీ, యూటీ పనులు చేపట్టాలని అధికారులకు మొర

ఎంజీకేఎల్ఐ 29వ ప్యాకేజీ కాల్వపై మరమ్మతుకు సమయమిదే..

కల్వకుర్తి, జనవరి 8 : ఎంజీకేఎల్ఐ కాల్వల ద్వారా సాగునీరు ఆగిపోవడంతో కాల్వలకు మరమ్మతులు చేపట్టాలనే డిమాండ్ రైతుల నుంచి ఊపందుకున్నది. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి కేఎల్ఐ ఎత్తిపోతల పథకం నుంచి కాల్వలకు సాగునీరు ఆగిపోయాయి. నీటి విడుదల ఆగిపోయిన నేపథ్యంలో కేఎల్ఐ కాల్వలకు సంబంధించిన మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అండర్ టన్నెల్‌లు, డిస్ట్రిబ్యూటరీ కాల్వల మరమ్మతులు, రెగ్యూలేటర్ పనులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నారు. కాల్వలకు సిమెంట్ లైనింగ్ లేకపోవడంతో కాల్వల్లోకి నీరు ఇంకిపోయి సమీప పొలాలు జాలువారి పంటలు పాడవుతున్నాయి. పంటలు పాడవ్వడమే కాకుండా సాగునీటి వృథా ఎక్కువగా అవుతుంది. సాగునీరు విడుదల ఆగిపోయిన నేపథ్యంలో కాల్వ మరమ్మతు పనులు చేపట్టేందుకు దాదాపు ఆరునెలల గడువు దొరికింది. గడువు లోపల పెండింగ్ పనులు పూర్తి చేయాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నారు.

కేఎల్ఐలో ప్రధానమైన ప్యాకేజీ 29 కాల్వ

కల్వకుర్తి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకంలో ప్యాకేజీ 29 కాల్వ ప్రధానమైంది. ఈ కాల్వ గుడిపల్లిగట్టు నుంచి కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి వరకు 160కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ కాల్వ టెయిల్‌ఎండ్ అయిన జంగారెడ్డిపల్లి నుంచి డీ-82(డిస్ట్రిబ్యూటరీ కాల్వ) ప్రారంభమై మాడ్గుల మండలం నాగిళ్ల వరకు మరో 58కిలో మీటర్ల వరకు ఉంది. ఈ కాల్వ ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలో దాదాపు 70వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ప్యాకేజీ 29ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లాలో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాలతోపాటు జడ్చర్ల, వనపర్తి నియోజకవర్గాలకు సాగునీరు అందుతుంది.

2017ఆఖరున కల్వకుర్తికి సాగునీరు..

కేసీఆర్ ప్రభుత్వం హయాంలో 2017 సంవత్సరం ఆఖరున కల్వకుర్తి నియోజకవర్గానికి సాగునీరు వచ్చింది. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 29వ ప్యాకేజీకి సంబంధించి ప్రధాన కాల్వ పనులు అక్కడక్కడ మొదలు పెట్టి వదిలేశారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులపై దృష్టి సారించింది. కల్వకుర్తి నియోజకవర్గానికి సాగునీరు రావాలంటే దుందుభీ వాగుపై అక్విడెక్ట్ నిర్మించాల్సి ఉంది. యుద్ధప్రాతిపదికన అక్విడెక్ట్ నిర్మించారు. చివరకు 2017ఆఖరున కల్వకుర్తి ప్రాంతానికి సాగునీరు వచ్చింది. ముందుగా వట్టిపోయిన చెరువులను నింపారు. చెరువుల నింపుతుండడంతో భూగర్భ జలాలు పైకి వచ్చాయి. ఆ రోజు నుంచి 2023 ఆఖరు వరకు సాగునీరు వస్తూనే ఉంది. కేవలం ఏప్రిల్, మే నెలలు మినహా దాదాపు 9,10 నెలల పాటు సాగునీరు అందించింది.

రైతులకు ఇబ్బందులు కలుగవద్దనే..

సాగునీరు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగవద్దనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం పనిచేసింది. ప్యాకేజీ 29 టెయిల్ ఎండ్ జంగారెడ్డిపల్లి వరకు 2017ఆఖరు నుంచి 2023ఆఖరు వరకు సంవత్సరంలో దాదాపు 8నుంచి 9నెలల పాటు సాగునీరు సరఫరా అయింది. కాల్వల్లో ఓవైపు సాగునీరు ఇస్తూనే మరోవైపు తాత్కాలిక పద్ధతిన పనులు చేస్తూ డిస్ట్రిబ్యూటరీ కాల్వ పనులు చేపట్టింది. కాల్వల్లో ఎప్పుడు సాగునీరు ఉండటం వల్ల కాంక్రీట్ పనులు చేపట్టడం చాలా వరకు వీలుపడలేదు. దీంతో కాంక్రీట్ పనులు చాలాచోట్ల మిగిలిపోయాయి. వర్షం నీరు కాల్వలోకి వస్తే కాల్వలు తెగిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో కాల్వల కింద వర్షం నీరు వెళ్లేలా నిర్మించాల్సిన యూటీ(అండర్ టన్నెల్‌లు) చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా డిస్ట్రిబ్యూటరీ 61,62, 63, 64లు పెండింగ్‌లో ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్వల్లో నీరు నిరంతరం ప్రవహిస్తుండడంతో రెగ్యూలేటర్ పనులు చేపట్టడానికి వీలుపడలేదు.

29ప్యాకేజీ కాల్వకు ఆగిన నీళ్లు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కేఎల్ఐ 29వ ప్యాకేజీకి సాగునీరు నిలిచిపోయింది. శ్రీశైలంలో నీరు లేనందున నీటిని నిలిపివేశామని అధికారులు చెబుతున్నారు. వర్షాలు వస్తేనే తిరిగి కాల్వల్లోకి సాగునీరు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్న నేపథ్యంలో.. తిరిగి వర్షాలు ప్రారంభమయ్యే లోపు కాల్వలకు సంబంధించిన పెండింగ్ పనులు పూర్తి చేయాలని కేఎల్ఐ రైతు జేఏసీ నాయకుడు బండెల రాంచంద్రారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాడు. జూన్, జూలై వరకు కాల్వలోకి సాగునీరు వచ్చే అవకాశం

వెంకటాపూర్ వద్ద డిస్ట్రిబ్యూటరీ కాల్వకు తాత్కాలిక పద్ధతిన ఏర్పాటు చేసిన సిమెంట్ గూన

లేదు. కాల్వ మరమ్మతులకు దాదాపు ఆరునెలల గడువు ఉంది. కేఎల్ఐ అధికారులు కాల్వ మరమ్మతులపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం 29వ ప్యాకేజీ పెండింగ్ పనులకు, డీ-82 కాల్వ పూర్తికి పూర్తి స్థాయిలో నిధులు ఇవ్వాలని, ప్రధానంగా కాల్వకు లైనింగ్ పనులు చేయాలని రైతులు కోరుతున్నారు.

కాల్వ మరమ్మతు పనులు చేపట్టాలి..

కాల్వలో నీరు ఆగిపోయింది. మళ్లీ వర్షాలు పడిన తర్వాత నీళ్లు వస్తాయి. అప్పటి వరకు ఆరునెలల గడువుంది. ఈ గడువులో 29వ ప్యాకేజీకి సంబంధించి జంగారెడ్డిపల్లి టెయిల్‌ఎండ్ వరకు పెండింగ్ పనులు చేపట్టాలి. కాల్వకు లైనింగ్ లేకపోవడం వల్ల కాల్వలో పూడిక పేరుకుపోతుంది. యూటీలు లేకపోవడం వల్ల వర్షం నీరు కాల్వలోకి వచ్చి కాల్వలు తెగిపోతున్నాయి. డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు రెగ్యులేటరీలు నిర్మించకుండా తాత్కాలిక పద్ధతిన సిమెంట్ గూనలు ఏర్పాటు చేశారు. వీటి వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ పనులపై దృష్టి సారించాలి. నాగిళ్ల వరకు సాగునీరు అందించే డీ-82 కాల్వ పనులు ఈ వానకాలం ఆరంభం నాటికి పూర్తి చేయాలి. ఈ నాలుగైదు రోజుల్లో ఈ ప్రాంత రైతులతో కలిసి ముఖ్యమంత్రి వద్దకు వెళతాం. – బండెల రాంచంద్రారెడ్డి, కేఎల్ఐ రైతు జేఏసీ అధ్యక్షుడు, కల్వకుర్తి

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో

ఆటో కార్మికులు ఆగం

- మాజీ మంత్రి సింగిరెడ్డినిరం జన్‌రెడ్డి



ఆటో యూనియన్‌స భ్యులనుఅభి నందిస్తున్న మాజీమ ంత్రిని రంజన్‌రెడ్డి

వనపర్తి, జనవరి 8 : ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఆటో కార్మికుల జీవితాలు ఆగమవుతున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ పట్టణ కార్మిక విభాగం ఆటో యూనియన్ నూతన కమిటీని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం, కానీ ఆటోలతో జీవనం సాగిస్తున్న వేలాది కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత కూడా వారిపై ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా కనుమరుగు చేయడానికి పూనుకుంటున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ఆటో యూనియన్ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, ప్రభుత్వం వెంటనే ఆటో కార్మికులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఆటో కార్మికులకు అండగా నిలిచిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితోపాటు మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డికి కార్మికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్స్ బండారు కృష్ణ, కంచెరవి, మహేశ్, మీడియా కన్వీనర్ అశోక్, ఆటో యూనియన్ కార్మిక సంఘం అధ్యక్ష,కార్యదర్శులు గంధం రాజు, గుర్రం శ్రీను, యాదయ్య, రాములు, సత్యంయాదవ్, గోపి, అనిల్, మన్యం, సమద్, రాజ్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

నకిలీ క్రిమిసంహారక మందులు పట్టివేత

- కొనుగోలు,సర ఫరా చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు
- వివరాలు వెల్లడించినఏఎస్పీ రవి

గద్వాల అర్బన్, జనవరి 8 : అమాయక రైతులను ఆసరాగా చేసుకొని నకిలీ క్రిమి సంహారక మందులను కొనుగోలు, సరఫరా చేస్తున్న వ్యక్తులను పట్టుకొన్నట్లు ఏఎస్పీ రవి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో కొంత మంది వ్యక్తులు నకిలీ ట్రైసర్, డిలిగగేట్ క్రిమిసంహారక మందులను కంపెనీ లోగో, స్కానర్‌లు పెట్టి కొనుగోలు, సరఫరా చేస్తున్నారని కంపెనీ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జిల్లాలోని అయిజ మండల కేంద్రంలో జై కిసాన్ ఎంటర్ ప్రైజెస్, ఇటిక్యాల మండలానికి చెందిన శ్రీనివాస అగ్రో ట్రేడర్స్ డీలర్స్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులు మోహన్ గౌడ్, జావెద్ జమీల్, విజయ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, అంకిత్, సునినీ కార్యం, తిమ్మారెడ్డి, జావెద్‌హుస్సేన్‌పై కేసు నమోదు చేయగా వీరిలో 6 మందిని పట్టుకొని విచారించినట్లు తెలిపారు. మిగతా ఇద్దరు పరారీలో ఉన్నారు. వీరు ఆన్‌లైన్‌లో మందులను కొనుగోలు చేసి సరఫరా చేసినట్లు గుర్తించారు. వీరి దగ్గర నుంచి 10బాటిళ్లను స్వాధీనం చేసుకోగా వాటి విలువ రూ.43,000 ఉంటుందన్నారు. ఈ కేసును ఛేదించిన అధికారులను ఎస్పీ రితిరాజ్ అభినందించారు. రైతులు ఎవరూ నకిలీ మందులను కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐ రామస్వామి, అయిజ ఎస్సై నరేశ్, ఇటిక్యాల ఎస్సై అశోక్‌బాబు ఉన్నారు.

స్వచ్ఛతలో మేటి అయిజ

- పరిశుభ్రతలో అయిజ మున్సిపాలిటీ ముందంజ
- ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ అవార్డుకు ఎంపిక

అయిజలోని డంపింగ్ యార్డు

అయిజ, జనవరి 8 : అయిజ మున్సిపాలిటీ స్వచ్ఛతలో మెరిసింది. మున్సిపల్ అధికారుల కృషి ఫలించి మేటిగా నిలిచింది. పారిశుధ్య నిర్వహణలో చేసిన కృషికి ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ పట్టణంగా గుర్తింపు సాధించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, స్వచ్ఛభారత్ మిషన్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో బహిరంగ మూత్ర విసర్జన రహిత (ఓడీఎఫ్ ప్లస్ ప్లస్) పట్టణంగా పురస్కారానికి ఎంపికైంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగం గా మున్సిపల్ అధికారులు ఇటీవల టాయిలెట్ క్లీన్ క్యాంపెయిన్ చేపట్టారు. బహిరంగ మల, మూత్ర విసర్జనతో కలిగే అనార్థాలపై అవగాహన కల్పించడంతోపాటు టాయిలెట్ల వినియోగంపై విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో అయిజ ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ అవార్డును దక్కించుకున్నది. అయితే అయిజ మున్సిపాలిటీకి స్వచ్ఛ పుర స్కారం రావడం సంతోషకరమని మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ దేవన్న, వైస్ చైర్మన్ నర్సింహులు, కౌన్సిలర్లు, పట్టణ ప్రజల సహకారంతో స్వచ్ఛ పుర స్కారానికి అయిజ ఎంపికైందని పేర్కొన్నారు. స్వచ్ఛ మున్సిపాలిటీగా అయిజ పట్టణం ఎంపిక కావడంతో పట్టణ ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆటోను ఢీకొట్టిన బస్సు : భార్యాభర్తలు మృతి

పెద్దకొత్తపల్లి, జనవరి 8 : ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఆటోను ఢీ కొట్టగా భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పెద్దకొత్తపల్లి మండలం వావిళ్లబావి స్టేజీ సమీపంలో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి కొల్లాపూర్ వైపు వెళ్తుండగా పెద్దకొత్తపల్లి నుంచి స్వగ్రామం చంద్రకల్ గ్రామానికి వస్తున్న మినీ ట్రాలీ ఆటోను ఆర్టీసీ బస్సు వేగంగా ఢీ కొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జు వ్వగా, ఆటో నడుపుతున్న హుస్సేన్(35), అతని భార్య హసీనా(28) అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జనరల్ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతులు గ్రామాల్లో పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు.

వావిళ్లబావి వద్ద ఆటోను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

చివరి ఆయకట్టు వరకు సాగు నీరు

- దేవరకద్ర, నారాయణపేట ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి
- కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వల ద్వారా పంటలకు నీటి విడుదల

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి సాగు నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి

దేవరకద్ర, జనవరి 8 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిచడమే ప్రభుత్వ ధేయమని దేవరకద్ర, నారాయణపేట ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కోయిల్ సాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల నుంచి యాసంగి పంటలు సాగు చేసేందుకు సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయకట్టు రైతులకు సాగు నీటి కష్టాలు ఉండవన్నారు. ఎడమ కాల్వ దేవరకద్ర నియోజకవర్గం పరిధిలో వస్తుందని, కుడి కాల్వ నారాయణపేట జిల్లా పరిధిలోకి వస్తుందన్నారు. ఆయకట్టు కింద ఉన్న దేవరకద్ర, చిన్నచింతకుంట, మరికల్, ధన్వాడ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు సాగు నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని సూచించారు. ఆయకట్టు రైతులు బాధ్యతగా ఒకరి తర్వాత ఒకరు నీరు పారించుకోవాలని, ఒక వెళ నీరు ఎక్కువై వృథా పోతుంటే వేంటనే ప్రాజెక్టు అధికారులకు సమాచారం ఇచ్చి కాల్వల నుంచి నీటి సరఫరాను బంద్ చేయించాలన్నారు. యాసంగిలో ఆయకట్టు రైతులకు ఐదు విడుతలుగా నీటి సరఫరా చేస్తామన్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ప్రకృతి సిద్ధంగా కొండల మధ్య ఆహ్లాదకరమైన, అద్భుతమైన వాతావరణంలో ఉందన్నారు. పర్యాటక రంగంలో వెనుకబడిపోయిందని, ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టును పర్యాటక స్థలంగా మారుస్తామని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ భారతమ్మ, ప్రాజెక్టు చైర్మన్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్, నాయకులు అంజిరెడ్డి, అరవింద్‌కుమార్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, వెంకటేశ్, భరత్, గోపాల్‌తోపాటు ఆయకట్టు రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం ప్రమాద ఘటనలో 24 మందిపై కేసు

బాలానగర్, జనవరి 8 : మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విధ్వంసానికి పాల్పడిన 24 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన డీసీఎం డ్రైవర్ కృష్ణారెడ్డి హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న క్రమంలో వాహనాన్ని నిర్లక్ష్యంగా నడుపుతూ రోడ్డు దాటుతున్న ఐదుగురి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే ప్రమాదంతో ఆగ్రహంతో చెలరేగిన ఘర్షణలో పోలీసులపై పలువురు దాడి చేశారు. సీసీ కెమారాలను పరిశీలించి ఫుటేజీ ఆధారంగా మరో 24 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

బొమ్మ అదుర్స్

- పెన్సిల్ ఆర్ట్‌తో అద్భుత చిత్రాలు
- కళాఖండాలతో ఔరా అనిపిస్తున్న మహేశ్
- తన నైపుణ్యతపై చిన్నారులకు సైతం శిక్షణ

వడ్డేపల్లి, జనవరి 8 : బొమ్మలంటే అతడికి ప్రాణం.. పెన్సిల్ చేతబట్టాడంటే చాలు ఎన్నో చిత్రాలు గీసి ఔరా అనిపిస్తున్నాడు.. వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన యువకుడు ఉమామహేశ్. కేవలం పెన్సిల్, పెన్నులతో తన చేతి నుంచి అద్భుత కళాఖండాలను సృష్టిస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాడు. ఎన్నో పేజీలు చదివితే కానీ అర్థంకాని విష యం ఒక్క బొమ్మతో అర్థమయ్యేలా చేయడంలో అతడికి మరెవరూ సాటిరారు. సెల్‌ఫోన్ కు బానిసవుతున్న నేటి విద్యార్థులు పుస్తకాలకు తాళం వేస్తున్నట్లు తెలిపే చిత్రం, కరోనా సమయంలో మనం ఎదుర్కొన్న సమస్యలపై, తెలంగాణ ఉద్యమ, స్వాతంత్ర సమరయోధుల చిత్రా లు, ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా ఎన్నెన్నో అద్భుత చిత్రాలను, కళాఖండాలను, క్రికెటర్ విరాట్ కోహ్లి వంటి సెలబ్రిటిల చిత్రాలను అవలీలగా వేయడ మంటే అతడికి ఎంతో మక్కువ. యువకుడు వేసిన చిత్రాలను చూసి ఎంతటి వారై నా మంత్రముగ్ధులు కావాలవాల్సిందే.. అతడిలోని నైపుణ్యాన్ని గ్రామంలోని చిన్నారులకు సైతం నేర్పిస్తున్నాడు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో, వివిధ కళల్లో నైపుణ్యం సాధించే లక్ష్యంతో అడుగులు వేయాలని కోరాడు. అయితే ఈ మధ్యే కానిస్టేబుల్ ఉద్యోగం సాధించానని, విధుల్లో చేరాల్సి ఉన్నదని ఆ యువకుడు తెలిపాడు. ఇతడి ప్రతిభను పలువురు ప్రశంసిస్తున్నారు.



ప్రముఖ క్రికెటర్ కోహ్లి, సినీహీరో ప్రభాస్ ఫొటోను పెన్సిల్‌తో గీసిన మహేశ్

మరిన్ని జిల్లా వార్తలు 8వ పేజీలో..